కార్మికుల భద్రత పట్టదా!

- రక్షణ కిట్లు లేకుండానే పారిశుద్ధ్య పనులు చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



బిచ్కుందలో రక్షణ కిట్లు లేకుండానే పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు

బిచ్కుంద(జుక్కల్): నిత్యం తెల్లవారు జామున లేచి, గ్రామాల పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య పనులు చేపడుతున్న జీపీ కార్మికులకు భద్రత కరువయ్యింది. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త ఎత్తడం, మురికి కాలువలు శుభ్రపరచడం, ప్రజలు లేవకముందే వీధులన్నింటిని శుభ్రం చేస్తున్న సపాయి కార్మికుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోంది. అధికారులు కనీస జాగ్రత్తలు లేకుండా వారితో పనులు చేయిస్తున్నారు. అసలే వానాకాలం కావడంతో మురికి పనులతో అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని కార్మికులు వాపోతున్నారు.

ఏడాదికి రెండు జతలు...

పారిశుద్ధ్య కార్మికులు చెత్త, మురికితో అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఆరోగ్య పరిరక్షణ కిట్లు ఇవ్వాలని గతంలో ఆదేశించింది. ఏడాదిలో కనీసం రెండు జతలు యూనిఫాం, రెండు జతలు షూలు, చేతి గ్లోజ్‌లు, మాస్క్, సబ్బులు, శానిటైజర్లు రక్షణ కవచాలు అందించి ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి. కానీ అధికారుల అలసత్వం కారణంగా వారి ద్వారా పనులు చేయిస్తున్నారే తప్ప ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు. కార్మికులకు కొన్ని నెలలుగా గ్లోజ్‌లు, మాస్క్, సబ్బులు, లాంగ్ బూట్లు, యూనిఫాం, ఇతర రక్షణ కవచాల సామగ్రిని అధికారులు ఇవ్వడం లేదు. ఎప్పుడో ఇచ్చిన యూనిఫాంను అప్పుడప్పుడు వాడుతున్నారు. కార్మికులకు తగిన భద్రత పరికరాలు లేక పనులు చేసేందుకు నిత్యం ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కార్మికుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు భద్రత కిట్లు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కిట్లు అందిస్తాం..

అన్ని జీపీల పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, గ్లోజ్‌లు, బూట్లు, సబ్బుల కిట్లు ఇవ్వాలని కార్యదర్శులకు సూచించాం. నిధులు లేకపోవడంతో కిట్లు ఇవ్వడంలో కొంత ఆలస్యం అయ్యింది. త్వరలో అందరికి కిట్లు అందిస్తాం. అలాగే కార్మికులకు వైద్య పరీక్షలు చేయించి మందులు అందిస్తున్నాం.

– కృష్ణ, ఎంపీవో, బిచ్కుంద

గుంతలమయంగా రోడ్డు



భిక్కనూరు: మండలంలోని సిద్ధరామేశ్వరాలయానికి వెళ్లేదారిలో ఉన్న బ్రిడ్జి వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఆలయానికి వెళ్లే భక్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ గుంతలను గమనించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నీటమునిగిన కంపోస్టు షెడ్డు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్ గ్రామ శివారులో నిర్మించిన కంపోస్టు షెడ్డు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. కంపోస్టు షెడ్డు నిర్మాణం చెరువు అంచున నిర్మించడంతో ఈ సంవత్సరం అధిక వర్షాలు పడడంతో చెరువులోకి వరద అధికంగా వచ్చింది. దీంతో కంపోస్టు షెడ్డు పూర్తిగా నీటిలోనే మునిగి ఉంది. ఇప్పటికైన అధికారులు స్పందించి షెడ్డు పరిసరాలలో నీటిని తొలగించి షెడ్డును రక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా డ్రెయినేజీ



బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది, సోమేశ్వర్ గ్రామాల్లో హైవే పక్కన నిర్మించిన డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో వాటిలో వర్షపునీరు, చెత్తాచెదారం నిలిచి దుర్గందం వ్యాపిస్తోంది. అలాగే దోమలు విపరీతంగా పెరిగిపోయి ఆయా గ్రామల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు శరవేగంగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దోమల వృద్దిని అరికట్టడానికి నీటితో నిండిన సైడ్‌డ్రైన్‌ను శుభ్రం చేయించాలని, దోమలు పెరగకుండా ఆయిల్‌బాల్స్ వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధం కావాలి



తాడ్వాయిలో మాట్లాడుతున్న వెల్మ సంతోష్‌రెడ్డి



మద్నూర్‌లో మాట్లాడుతున్న తుకారాం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): త్వరలో గ్రామాలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నిలకు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం స్థానిక సంస్థల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికి టికెట్ ఇచ్చిన అందరం కలసి కట్టుగా పని చేసిన పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిందర్‌రావు, నాయకులు గంగారెడ్డి, మర్రి బాపురెడ్డి, లింగారావు, హోటల్ శ్రీను, వెంకట్‌రావు, తిరుపతిరెడ్డి, దత్తాత్రేయ, నర్సారెడ్డి, స్వామిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ మండలంలో..

మద్నూర్(జుక్కల్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని పార్టీ మండల అధ్యక్షుడు తెప్పవార్ తుకారాం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. నాయకులు తుల సంతోష్, హన్మాండ్లు, శంకర్‌పటేల్, పండిత్‌రావ్‌పటేల్ తదితరులున్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి



మల్లికార్జునప్ప (ఫైల్)



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జునప్ప షెట్కార్ మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాత్రి మండల నాయకులతో సమావేశమైన ఆయన మంగళవారం తెల్లవారుజామున నిద్రలోనే గుండె పోటు రావడంతో మరణించారు. 1978లో బిచ్కుంద సర్పంచ్‌గా, రెండుసార్లు బిచ్కుంద మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. మల్లికార్జునప్ప మృతి విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, సౌదాగర్ గంగారాం, అరుణతార, ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, బండయప్ప మఠం పీఠాధిపతి సోమయప్ప స్వామిజీ తదితర ప్రముఖులు అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేసి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను మంగళవారం ఆర్డీవో పార్థసింహారెడ్డి పరిశీలించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులను ఉంచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. తహసిల్దార్ ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో ప్రకాష్ తదితరులు ఉన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

క్లుప్తంగా

ఆస్పత్రి పడకలను కుదించడం సరికాదు



బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిని 200 పడకల నుంచి 150 పడకలకు కుదించడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా నాయకులు దుబాస్ రాములు అన్నారు. వెంటనే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ఆస్పత్రి కార్మికులతో కలిసి ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిని 150 పడకలకు తగ్గించడంతోపాటు కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రస్తుతం కార్మికులను కూడా తక్కువగా నియమిస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యను వెంటనే పరిష్కారించాలని కోరారు. కార్మికులు రేణుక, ధనుంజయ్, లక్ష్మణ్, మహేందర్, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్...

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కందర్‌పల్లి రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంతలను అధికారులు పూడ్చివేయించారు. గుంతల రోడ్డుపై ఈనెల 21న ‘సాక్షి’ దినపత్రికలో ‘గోతి ఉంది జాగ్రత్త..’ అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించి, మంగళవారం గుంతలలో స్టోన్ పౌడర్ వేసి రోడ్డును చదును చేశారు.

కామారెడ్డికి చేరిన జన చైతన్య బైక్ యాత్ర



కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ చేపట్టిన జనచైతన్య బైక్ యాత్ర మంగళవారం కామారెడ్డికి చేరుకుంది. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాల రహిత సమాజం కోసం రాష్ట్రవ్యాప్తంగా జనచైతన్య బైక్ యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో వివిధ గ్రామాల మీదుగా 1800 కిలోమీటర్లు ప్రయాణించాలనే లక్ష్యంతో ఐదు రోజుల క్రితం యాత్రను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి ప్రాంతానికి చెందిన ప్రభాకర్ మిత్రులు ఆకిటి రవీందర్‌రెడ్డి, సదాశివనగర్ మార్కెట్ కమిటి చైర్మన్ అంబీర్ శ్యాంరావు, స్వామి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

సర్పంచ్ రిజర్వేషన్‌ను ఎస్సీ వర్గానికి కేటాయించాలి



సదాశివనగర్ (ఎల్లారెడ్డి): మండలంలోని తిర్మన్‌పల్లి సర్పంచ్ స్థానాన్ని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని గ్రామ అంబేడ్కర్ సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల తండాలో కేవలం 18 ఎస్టీ కుటుంబాలు ఉన్నాయన్నారు. అతి తక్కువ జనాభా ఉన్న ఎస్టీలకు సర్పంచ్ స్థానం కేటాయించడం ఇది రెండోసారి అని అన్నారు. ఎస్సీ సామాజిక వర్గంలో ఎక్కువ జనాభా ఉన్నప్పటికీ గత కొన్ని సంవత్సరాల నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఎస్సీ సామాజిక వర్గానికి సర్పంచ్ స్థానం రిజర్వ్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తిర్మన్‌పల్లి సర్పంచ్ స్థానాన్ని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించే విధంగా కృషి చేయాలని విన్నవించారు.

వరి పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని సర్వాపూర్, మేడిపల్లి శివారుల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో వరి పొలాలను ఏవో రాజలింగం పరిశీలించారు. వరి పైరులో మొగిపురుగు, మెడవిరుపు, ఎండాకు తెగులుతోపాటు దోమ ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటి నివారణకు సంబంధిత రైతులకు సస్యరక్షణ కోసం తగిన సూచనలు చేసినట్లు తెలిపారు. ఏఈవోలు దీక్షిత్ రెడ్డి, కరుణేశ్వర్, రైతులున్నారు.

కలెక్టరేట్‌లో ముగిసిన బతుకమ్మ వేడుకలు



కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు, సిబ్బంది

కామారెడ్డి క్రైం: నవరాత్రుల పాటు కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు మంగళవారం ముగిశాయి. కలెక్టర్ స్వయంగా వేడుకల్లో పాల్గొని అధికారులు, సిబ్బందిని ఉత్సాహపరిచారు. తొమ్మిది రోజుల పాటు వేడుకల్లో పాల్గొన్న మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలకు నిలువటద్దం బతుకమ్మ వేడుకలు అని అన్నారు. డీఆర్‌డీవో సురేందర్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గంధభరితంగా మూత్రశాలలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి బస్టాండ్‌లోని మూత్రశాలలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎల్లారెడ్డి బస్టాండ్‌ను 4 కోట్ల రూపాయల మున్సిపల్ నిధులతో నిర్మించి జూన్ 24న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావులు ప్రారంభించారు. బస్టాండ్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా టాయిలెట్స్‌కు సంబంధించిన తాళాలు తీయకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం చేశారు. దీంతో కొన్ని రోజుల క్రితం టాయిలెట్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. కానీ వాటిని పట్టించుకునేవారు లేకపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లోని టాయిలెట్స్ నుంచి వాసన రాకుండా స్కావెంజర్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఎల్లారెడ్డి బస్టాండ్‌లోని టాయిలెట్స్

ఉన్నతాధికారులకు నివేదించాం..

ఎల్లారెడ్డి బస్టాండ్‌లో టాయిలెట్స్ మెయింటెనెన్సుకు సంబంధించి స్కావెంజర్‌ను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అంతవరకు పారిశుధ్య సిబ్బంది చేత టాయిలెట్స్‌ను శుభ్రం చేసేలా చర్యలు చేపడతాం. దుర్గంధం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– గంగారాం, స్టేషన్ మేనేజర్, బాన్సువాడ

సంక్షిప్తం

పదవీ విరమణ సన్మానం



భిక్కనూరు: మండలంలోని సిద్ధరామేశ్వరాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసిన సత్యనారాయణ మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా ఆయనను ఆలయంలో ఘనంగా సత్కరించారు. ఆలయ ఈవో శ్రీధర్, అర్చకులు రామగిరిశర్మ, రాజేశ్వర్‌శర్మ, సిద్దేశ్, రామారెడ్డి ఆలయ ఈవో ప్రభురాంచంద్రం, నేతలు లింబాద్రి, అందే దయాకర్‌రెడ్డి, ప్రభాకర్‌గుప్త, నాగభూషణం గుప్త పాల్గొన్నారు.

గ్రామపాలన అధికారుల కమిటీ ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ పాలన అధికారుల సంక్షేమ సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా దుబాషి మాణిక్యం, ప్రధాన కార్యదర్శి జోనుగంటి చంద్రం,



కోశాధికారిగా ధర్మపురితోపాటు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం అందజేత



మాచారెడ్డి: పాల్వంచ మండలం పోతారం గ్రామానికి చెందిన గ్యార సత్తవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి మంగళవారం మాదిగ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. సమితి ప్రతినిధులు గంగని శ్రీనివాస్, సభ్యులు నవీన్, జగన్, జానీ, నరేశ్, రాజనర్సు ఉన్నారు.



గోలిలింగాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బీర్కూర్‌లో..



హసన్‌పల్లిలో..

ఒక్కేసి పువ్వేసి చందమామ..



దన్నూర్‌లో బతుకమ్మలతో మహిళలు



కొర్పోల్ గ్రామంలో..



పాల్కంపేటలో..



పెద్దకొడప్‌గల్‌లో..



అడ్లూర్ ఎల్లారెడ్డిలో..



గండిమాసానిపేటలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను తయారుచేశారు. సాయంత్రం వేళ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో బతుకమ్మలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాటి చుట్టూ ‘ఒక్కేసి పువ్వేసి చందమామ..’ ‘బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..’ అనే బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. పలు చోట్ల కోలాటం ఆడుతూ సందడి చేశారు. అలాగే బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.



బీర్కూర్‌లో బతుకమ్మలతో చిన్నారులు



పెద్దకొడప్‌గల్‌లో..



ఎల్లారెడ్డి మండలంలో..

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



శబరిమాత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటాన్ని రకరకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలను జరిపించారు.